క్లుప్తంగా

సామాన్యుడిలా ఎంపీ, ఎమ్మెల్యే..



రోడ్డు పక్కన బండి వద్ద టిఫిన్ చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అశ్వారావుపేట పర్యటనలో భాగంగా ఏలాంటి హంగు, ఆర్భాటం లేకుండా రోడ్డు పక్కన ఉన్న ఓ తోపుడి బండి వద్ద టిఫిన్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న తోపుడి బండి వద్దకు వెళ్లిన ఎంపీ ఓ సామాన్యుడిలా నిలబడి దోస, సింగిల్ ఇడ్లీ తిన్నారు. ఆయనతోపాటే ఎమ్మెల్యే కుడా అక్కడే టీఫిన్ చేయడంతో తోపుడు బండి వద్ద ఉన్న వారంతా ఎంపీ, ఎమ్మెల్యేను చూసి వారితో సెల్ఫీలు దిగారు.

ఘనంగా బుద్ధ జయంతి

మణుగూరురూరల్: బౌద్ధ అభిమానుల ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీహెచ్‌సీ రైల్వే గ్యారేజ్ ఆవరణలో వారు మొక్కలు నాటారు. అనంతరం నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. బౌద్ధ అభిమాన సంఘం సభ్యుడు మంగీలాల్ బుద్ధుని సేవలను, భౌద్ధ ధర్మం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వి.శంకర్, కె.గురుమూర్తి, జి.నాగేశ్వరరావు, వై శంకర్, ఎం.గురుప్రసాద్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు అందజేయాలి

దుమ్ముగూడెం: మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంగా మండలంలో మంచినీటి ఎద్దడి నెలకొందని, పర్ణశాల పంపు హౌస్ వద్ద పూడిక తీత పనులు పూర్తి చేసి నీళ్లు అందించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్, కోకన్వీనర్ కణితి రాముడు, జానీపాషాలు అన్నారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తక్షణమే నిరంతరాయంగా తాగు నీరు అందించాలన్నారు. సమావేశంలో నాయకులు మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, దామెర్ల శ్రీనివాసరావు, వాగే వెంకటేశ్వరరావు, భూక్యా చందు, తంత్రపల్లి వెంకటేశ్వరరావు, వాగే కిట్టు, కుమ్మరికుంట సూర్య, బిలపాటి లక్ష్మణ్ రావు, బానోతు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మరోవైపు, మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల దుమ్ముగూడెం, చర్ల మండలాల ప్రజలు మంచినీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తెల్లం హరికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

విజయవంతమైన అప్రెంటీస్ మేళా



మేళాలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవి

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్‌లోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన నేషనల్ అప్రెంటీస్ మేళా విజయవంతమైనట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జి.రవి తెలిపారు. అప్రెంటీస్ మేళాలో హైదరాబాద్‌కు చెందిన రాణి ఇంజన్‌వాల్స్, ఫెనెస్ట్ బిల్డింగ్ సిస్టమ్స్, వీఎల్ఆర్ ఫెసిలిటేటర్స్, ఇతర కంపెనీల ప్రతినిధులు వారి ఉద్యోగ వివరాలకు సంబంధించిన విషయాలను తెలిపారు. మేళాకు 115మంది విద్యార్థులు హాజరు కాగా.. 45మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కృష్ణసాగర్ ఐటీఐ ప్రిన్సిపల్ ధర్మాచారి, ఎన్ఎస్‌డీసీ విశ్వకర్మ జిల్లా కోఆర్డినేటర్ పల్లవి, ఐటీఐ సూపరింటెండెంట్ టీఎస్ జ్యోతిరాణి, ఏటీవోలు జీవీ కృష్ణారావు, అంకం నరసయ్య, మయ్యా శ్రీనివాసరావు, వేణుగోపాల్ నాయుడు, కంపెనీల ప్రతినిధులు ధర్మ, నవీన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన బోడపాటి వల్లభరావు తన కుమార్తె కలిసి విరాళం అందించారు. తన సోదరుడు దివంగత బోడపాటి కృష్ణ వెంకటేశ్వర్లు పేరున రూ.లక్ష విరాళం చెక్కును ఆలయ ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువాతో సత్కరించి బాబా వారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆకెళ్ల శ్రీరామ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సూర్య ప్రతాపం

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న కూలీలు
- వసతులు ఏర్పాటు చేయని అధికారులు



మండుటెండల్లో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

బూర్గంపాడు: ఉపాధి హామీ పనులపై భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం ఏడుగంటల నుంచే ఎండల తీవ్రత పెరుగుతోంది. ఉదయాన్నే ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీలు ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎండలతో కూలీల సమస్యలు

వ్యవసాయ పనులు పూర్తయి ప్రస్తుతం ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మే నెల ఆరంభం నుంచి ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. అయితే పనులకు వెళ్తున్న కూలీలకు ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే పనులకు వెళ్లిన ఎండల తీవ్రతకు కొద్దిసేపటికే అలసిపోతున్నారు. ఇంటి నుంచి బాటిళ్లలో తీసుకెళ్లిన మంచినీళ్లు గంటసేపటికే వేడెక్కుతున్నాయి. దాహం తీర్చుకునేందుకు కూలీలు వేడినీళ్లే తాగాల్సి వస్తుంది. ఎండలకు పలుగు, పార వేడెక్కటంతో చేతులు బొబ్బలు వస్తున్నాయి. ఎండలకు పనికి వెళ్లిన కూలీలు వడదెబ్బకు గురవుతున్నారు. కొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. కొందరు బాగా నీరసించి మరునాడు పనులకు వెళ్లలేక పోతున్నారు. పనులు చేసి ఆలసినప్పుడు కొద్దిసేపు సేద తీరే పరిస్థితులు లేవు.

వసతులు ఎక్కడ?

ఉపాధి హామీ పనిప్రాంతాల్లో కనీస వసతులు లేవు. ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పనిప్రాంతాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచటం లేదు. దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనికి వెళ్లిన గంటసేపటికే కూలీలు ఎండల కారణంగా అలసిపోతున్నారు. దీనికి తోడు మండుటెండల్లో చేతులు బొబ్బలు వచ్చేలా పనులు చేస్తున్నా రోజుకు రూ.200 వేతనం కూడా దక్కడం లేదు. శ్రమకు తగిన వేతనం దక్కటం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనిప్రాంతాల్లో వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు. టెంట్లు, చల్లటి తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఆత్మీయ భరోసాకు పరుగులు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన కూలీలనే ఈ పథకంలో అర్హులుగా గుర్తించారు. మే నెలలో కనీసం పది నుంచి పదిహేను రోజులు పనులకు వెళ్తేనే ఈ పథకంలో అర్హులవుతారు. ఎండల తీవ్రత ఇబ్బందులు పెడుతున్న ఆత్మీయ భరోసా పథకం కోసం కూలీలు మండుటెండలను లెక్కచేయకుండా పనులు చేయాల్సి వస్తుంది.

మండుటెండలోనే భోజనం



ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలోని ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో నీడ సౌకర్యం లేదు. దీంతో కూలీలు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుటెండలోనే కూర్చొని ఉపాధి కూలీలు భోజనం చేస్తుండగా సోమవారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది. అధికారులు స్పందించి ఉపాధి హామీ పనుల వద్ద నీడ సౌకర్యం కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

అన్నమాచార్యుడి జయంతిపై నిర్లక్ష్యం



దేవాలయ ఆవరణలో అన్నమాచార్యుడి విగ్రహం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): వాగ్గేయకారుడు, పదకవితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడి జయంతోత్సవాన్ని అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్యుడి విగ్రహాన్ని రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అయితే సోమవారం ఆయన జయంతి ఉండగా దేవాదాయ శాఖాధికారులు పట్టించుకోలేదు. దీంతో అన్నమాచార్యుడి భక్తులు శాఖాధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు.

15న వాహనాల వేలం

మణుగూరురూరల్: ఈ నెల 15వ తేదీన గంజాయి, నాటుసారా కేసులలో పట్టుబడిన వాహనాలను మణుగూరు ప్రొహిబేషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఆర్ రాజిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు 15న ఉదయం 10గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

నరసింహాస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

చర్ల: సుబ్బంపేట సమీపంలోని గోదావరి నదీ తీరం వద్ద ఉన్న లక్ష్మీనరసింహాస్వామి వారి ఆలయంలో సోమవారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. చర్లకు చెందిన పెందుర్తి ఆంజనేయులు కుటుంబ సభ్యులు స్వామి వారికి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, మంగళ సూత్రాలు, మెట్టెలు అందజేయగా.. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. ఈ మహోత్సవానికి సమీప గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వారికి అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనుగోలు కేంద్రంలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..



వివరాలు సేకరిస్తున్న సివిల్ సప్లయీస్ డీటీ శ్రీనివాసరావు

ములకలపల్లి: మండల పరిధిలోని పూసుగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో (పీపీసీ) సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ కేంద్రంలో ధాన్యం తరుగు పేరిట క్వింటాకు రూ.115 నుంచి 200 వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. నగదు చెల్లించిన వారికే ధాన్యం తరలించేందుకు లారీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో 'పైసలిస్తేనే ధాన్యం తరలింపు'శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన అధికారులు విచారణ నిర్వహించారు. సివిల్ సప్లయీస్ డీటీ సుంకర శ్రీనివాసరావు సోమవారం పీపీసీ సెంటర్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి సమగ్ర వివరాలు సేకరించారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు కొనుగోళ్లు జరపాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. సమగ్ర నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు.

టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందిస్తున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

గుండాల: మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగియగా.. విజేతలకు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను బహుమతులు అందజేవారు. గుండాల, కొమరారం, ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు చెందిన 40 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొనగా.. దామరతోగు జట్టు మొదటి స్థానంలో నిలిచింది. వీరికి రూ.15వేలు నగదుతోపాటు షీల్డ్‌ను డీఎస్పీ అందజేశారు. రెండో స్థానంలో చిన్న వెంకటాపురం జట్టుకు రూ.10 వేలు, షీల్డ్, తృతీయ స్థానంలో మామకన్ను జట్టుకు రూ.6వేలతో పాటు షీల్డ్ అందజేశారు. చెడు మార్గాలవైపు పోవద్దని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ఈ సందర్భంగా డీఎస్పీ ఏజెన్సీ యువతకు సూచించారు. విజయవంతంగా టోర్నమెంట్ నిర్వహించిన సీఐ రవీందర్, ఎస్సై సైదా రహూఫ్, సిబ్బందిని అభినందించారు.

సమ్మె విజయవంతానికి సమావేశం



మణుగూరురూరల్: బీటీపీఎస్ సీఈకి సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

ములకలపల్లి: ఈనెల 20వ తేదీన జరుపతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. ములకలపల్లి పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశం ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు.

పాలకపక్షాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సమ్మె తలపెట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, మాలోతు రావూజా. నిమ్మల మధు, పాయం అమల, బైరు సాయి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

మణుగూరురూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు సమ్మె నోటీస్ అందజేశారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్రపల్లి సాంబశివరావు, నైనారపు నాగేశ్వరరావు, జి.మోహన్‌రావు, సుధాకర్, ఆర్ శ్రీను, సాంబయ్య, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అరుంధతినగర్, వినాయకనగర్, బాలాజీనగర్, భగత్ సింగ్‌నగర్ ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ.20కోట్ల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.మరోవైపు, మండలంలోని సమితిసింగారం గ్రామపంచామతీ సంకల్పసిద్ధి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నర్సింహాస్వామిని ఎమ్మెల్యే పాయం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.ప్రసాదరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సత్య, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సతీష్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీస్తాం..



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

దుమ్ముగూడెం: మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఎమ్మెల్యే తెల్లం వెంకటరావును వదిలిపెట్టబోమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు హెచ్చరించారు. సోమవారం సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ములకపాడు సెంటర్ నుంచి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు వరకు ప్రజా ప్రదర్శన ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుదర్శన్.. మండలంలో 37 గ్రామపంచాయతీ పరిధిలో సమస్యలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. ప్రగళ్ళపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ వెంటనే నిధులు విడుదల చేయాలని, తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండలంలో మిగిలిపోయిన పోడు రైతులకు హక్కు పత్రాలు ఇచ్చి త్రీఫేస్ కరెంట్ వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లి సత్యనారాయణ, వాగే ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

అశ్వారావుపేరూరల్: రైతులు తమ పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని నారంవారిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంట మార్పిడి, పచ్చి రొట్టె, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడం, సేంద్రియ పద్ధతులు, ఎరువుల వినియోగం గురించి అవగాహన కల్పించారు. అలాగే పామాయిల్ మల్చింగ్, అంతర పంటల సాగుపై వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణతేజ, ఏఓ శివరాంప్రసాద్, ఏఈఓ సతీష్, పశుసంవర్ధక శాఖ ఎండీ.మధార్‌భక్ష్ పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండల పరిధిలోని నల్లివారిగూడెం, దమ్మపేట, మండలపల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నల్లివారిగూడెం గ్రామంలో గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురిని పరామర్శించి భరోసానిచ్చారు. మండలపల్లి నుంచి దమ్మపేట గ్రామం వరకు కొనసాగుతున్న డివైడర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సన్మానం



విద్యార్థులను సన్మానించిన స్థానిక ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగ్యులు, రిటైర్డు ఉద్యోగులంతా కలిసి మొత్తం 16 మంది విద్యార్థులకు శాలువా కప్పి జ్ఞాపికలను అందించారు. అలాగే విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నార్లపాటి రమ్య, జుజ్జూరపు మోక్షిత్‌బాబు, తగరం శిరిష, ఉద్యోగులు నార్లపాటి రవీంద్ర, నార్లపాటి రాంబాబు, నార్లపాటి జగదీష్, రమేష్, ఏసుబాబు, గద్దం శివాజీ, విశ్రాంత ఉద్యోగులు జుజ్జూరపు శ్రీరామ్మూర్తి, బడిపాటి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో మిల్లర్ల దగా

- కాంటా వేసిన ధాన్యానికి అభ్యంతరాలు
- తేమ, తాలు పేరుతో నిరాకరణ
- క్వింటాకు రెండు కిలోల చొప్పున తరుగు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు



రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం

ప్రభుత్వ ఆదేశాలను పక్కన పెడుతూ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కల్లాల్లో పరీక్షించి కాంటా వేసి పంపిన ధాన్యాన్ని కూడా తేమ, తాలు సాకులతో నిరాకరిస్తున్నారు. కాంటా వేసే సందర్భంలోనే కిలోన్నర ధాన్యం అదనంగా తీసుకుంటుండగా.. మళ్లీ మిల్లుల వద్ద అదనంగా రెండు కిలోలు తీసుకోవడంతో మొత్తంగా రైతులు మూడు కిలోల మేర ధాన్యాన్ని పోగొట్టుకుంటున్నారు.

చర్ల: రైతులు పండించిన ధాన్యాన్ని వరికోత యంత్రాల ద్వారా కోసి కళ్లాల్లో రెండు వారాలకు పైగా ఆరబోసిన తరువాత తగినంత తేమశాతం వచ్చిన తరువాతనే అధికారులు ధృవీకరిస్తున్నారు. అటు తరువాతనే కాంటా వేసి మిల్లులకు తరలిస్తున్నారు. అయితే ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తరువాత అక్కడ మిల్లర్లు ధాన్యంలో తేమ శాతం పరిపడా ఎక్కువగా ఉందని, ధాన్యం మిల్లింగ్ చేస్తే ముక్కలు అవుతున్నాయని కొర్రీలు పెడుతున్నారు. ఈ వంకలతో డబ్బులు వసూళ్లు చేస్తున్నరని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

డబ్బు చెల్లిస్తేనే దిగుమతి

ధాన్యంలో పలు సాకులు చూపుతు మిల్లర్లు లారీల్లో నుంచి ధాన్యం దించకుండా నిరాకరిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే తాము తీసుకోబోమని, వేరే మిల్లుకు తీసుకెళ్లండంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో వేరే మిల్లులు తీసుకెళ్లలేక, మిల్లుల దగ్గర నుంచి తిరిగి ఇంటికి తెచ్చుకోలేక.. రైతులు మిల్లర్ల కోతలకు తలొగ్గుతున్నారు. మిల్లర్లు క్వింటాకు రెండు, మూడు కిలోల చొప్పున తరుగు తీస్తామని చెప్పడంతో అంగీకరించాల్సి దుస్థితి ఏర్పడింది. అదీ కాకుండా తరుగు తీసే ధాన్యానికి సంబందించి రెండు కిలోలకు రూ.52, మూడు కిలోలకు రూ.73 చొప్పున రైతులు చెల్లిస్తేనే మిల్లర్లు దించుకొంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

కాంటాలోనూ అదనమే..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాటా వేసే సందర్బంలోనూ దాన్యం అదనంగానే తీసుకుంటున్నారు. తరుగు పేరిట ఒక కిలో, ఖాళీ బస్తా బరువు పేరిట ఒక కిలో తీసుకుంటున్నారు.

అయితే ఖాళీ సంచి కేవలం 500 నుంచి 600 గ్రాముల బరువు మాత్రమే ఉంటుండగా, కిలో ధాన్యం తీసుకుంటుండడంతో ఇందులో కూడా 400 నుంచి 500 గ్రాముల వరకు ధాన్యం అదనంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద కాంటా వేసే సందర్భంలోనే కిలోన్నర ధాన్యం అదనంగా తీసుకుంటుండగా మళ్లీ మిల్లుల వద్ద అదనంగా రెండు కిలోలు తీసుకోవడంతో మొత్తంగా రైతులు మూడు కిలోల మేర ధాన్యాన్ని పోగొట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికంగా పలువురు రైతులు కోరుతున్నారు.

డబ్బు వసూలు సరికాదు

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించిన ధాన్యానికి మిల్లర్లు రైతుల నుంచి తరుగు, తాలు పేరుతో కొర్రీలు పెట్టి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం సరికాదు. పది పదిహేను రోజుల పాటు కల్లాల్లో ధాన్యం ఆరిన తరువాత అధికారులు తేమశాతం పరీక్షించి, కాంటా వేసి పంపిన ధాన్యానికి సాకులు చూపడం సరికాదు. ఈ పేరుతో మిల్లర్లు రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ పద్దని మానాలి. ఇటువంటి మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

–డి.అబ్రహాం, రైతు, కుదునూరు